
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 8 అక్టోబరు 2025



పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పారా మెడికల్ బోర్డు కోర్సులు డీఎంఎల్‌టీ, డీఈసీజీలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వాల్యా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎంఎల్‌టీలో 30, డీఈసీజీలో 30 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈనెల 8 నుంచి 28 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వీకరించబడుతాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు టీజీపీఎంబీ.తెలంగాణ. జీవోవి.ఇన్ వైబ్‌సైట్‌లోదరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిజాంసాగర్ నీటి విడుదల కొనసాగింపు

- ప్రాజెక్టుల్లో 32,820 క్యూసెక్కుల వరద రాక
- ఐదు గేట్ల ద్వారా 32,820 క్యూసెక్కుల నీరు విడుదల

నిజాంసాగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ఎత్తివేత కొనసాగుతునే ఉంది. మంగళవారం నాటికి వీఆర్ నెంబర్-5లోని ఐదు గేట్ల ద్వారా 32,820 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు. మంజీరా వెంట 32,820 వరద నీరు ప్రాజెక్టులోకి వస్తూనే ఉంది. ప్రాజెక్టులో 1405 అడుగుల నీటిమట్టం గాను 1404.91 అడుగుల నీటి మట్టాన్ని నిల్వ చేస్తున్నారు. ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో పర్యాటకులు చూసేందుకు పెద్ద ఎత్తున వస్తున్నారు.



- షెడ్యూల్ విడుదలైనా రిజర్వేషన్లపై వీడని సందిగ్ధత
- నేడు హైకోర్టు తీర్పుపైనే అందరిచూపు
- తేల్చిన రిజర్వేషన్లు నిలిచేనా?
- రిజర్వేషన్ల మార్పులు, చేర్పులపైనే చర్చ
- ముందస్తు ఖర్చుకు వెనకడుగు వేస్తున్న ఆశావహులు
- తీర్పు ఎలా వచ్చినా ముందుకెళ్లే పనిలో యంత్రాంగం

తీర్పుపై ఉత్కంఠ

కామారెడ్డి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినా ఆశావహుల్లో ఉత్కంఠ తొలగడం లేదు. రిజర్వేషన్‌లు ప్రకటించినా అనిచ్చితి కొనసాగుతునే ఉంది. కలిసొచ్చిన వారు ప్రచారం చేసుకోవాలో.. వద్దో తెలియక డైలామాలో పడిపోయారు. రిజర్వేషన్‌లు కలిసిరాని వారు కోర్టు తీర్పు తమకే అనుకూలంగా వస్తుందని ధీమాలో ఉన్నారు. ఎన్నికలు ఉంటాయా? ఉండవా? అనే విషయం బుధవారం హైకోర్టు ఇచ్చే తీర్పుపై ఆధారపడి ఉంది. ఈ తీర్పు ఎలా వస్తుందో ఇవే రిజర్వేషన్‌లు ఉంటాయా లేక మారుతాయా అనే టెన్షన్ ఆశావహుల్లో నెలకొంది. ఒకవేళ పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు చేపడితే ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్లలో మార్పులు, చేర్పులు ఎలా ఉంటాయోనని ఆశావహుల్లో ఆందోళన కనిపిస్తోంది. నేడు హైకోర్టు ఇచ్చే తీర్పుతో రిజర్వేషన్లపై ఉత్కంఠకు తెర పడుతుందో లేదో చూడాలి.

నేడు హైకోర్టు తీర్పు

ఈనెల 9న రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల సిబ్బందికి శిక్షణ సైతం పూర్తి చేస్తుంది. కానీ అంతకు ఒకరోజు ముందు అంటే బుధవారం హైకోర్టులో ఎన్నికల భవిష్యత్తు తేలనుంది. రాజ్యాంగానికి విరుద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ ఎన్నికలకు వెళ్లడంపై వేసిన కేసుకు సంబంధించిన తీర్పు నేడు రానుంది. చట్టబద్ధతలేని రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు అనుమతి ఉండకపోవచ్చన్న భావన వినిపిస్తోంది. మరోవైపు మరో అవకాశం ఏదైన ఇవ్వచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నాయి. లేనిపక్షంలో పాత రిజర్వేషన్ల కోటా ప్రకారమైన ఎన్నికలను కొనసాగించవచ్చని అధికార పార్టీ వర్గాలే వెల్లడిస్తున్నాయి.

సర్పంచ్, వార్డు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఇలా..

	స్థానాలు	100శాతం ఎస్టీ	ఎస్టీ	ఎస్సీ	బీసీ	అన్ రిజర్వు
సర్పంచ్	532	65	26	79	201	161
వార్డు	4,656	498	224	732	2,044	1,438
జడ్పీటీసీ	25	0	02	04	11	08
ఎంపీటీసీలు	233	0	20	40	98	75

రిజర్వేషన్‌లు కొనసాగుతాయా? మారుతాయా?

జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ వార్డు సభ్యుల స్థానాల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్ స్థానాలు పెరిగాయి. జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానం కూడా జనరల్‌గా రిజర్వ్ కాగా జిల్లాలోని ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల్లో 11 చొప్పున బీసీ వర్గాలకు రిజర్వ్ అయ్యాయి. ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లోనూ 42 శాతం రిజర్వేషన్‌లతో బీసీలకు స్థానాలు గణనీయంగా పెరిగాయి. అయితే రిజర్వేషన్ల కోటా అంశంపై బుధవారం హైకోర్టు తీర్పు నేపథ్యంలో రిజర్వేషన్‌ల అమలుపై ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌లు అమలు అవుతాయా లేదా అనే సందిగ్ధత కొనసాగుతోంది.

బీసీ వర్గాల్లో ఆందోళన

స్థానిక సంస్థల ఎన్నికలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ విధంగానే అధికార యంత్రాంగం జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్‌లను ఖరారు చేసింది. అయితే దీనిపై కొందరు కోర్టుకు వెళ్లడంతో బీసీ వర్గాల్లో ఆందోళన నెలకొంటుంది. రాజకీయంగా జిల్లాలో కోర్టు తీర్పు ప్రభావం ఎక్కువగా ఉండనుంది. బీసీ వర్గాలు అధికంగా ఉన్న మండలాల్లో పంచాయతీ ఎన్నికల సమీకరణాలు తారుమారు కావచ్చని నాయకులు చెబుతున్నారు. జిల్లా ప్రజలతో పాటు నాయకులు, ఆశావహులు పార్టీ కార్యకర్తలు కోర్టు తీర్పు కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.



భద్రత రూంను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

ఈవీఎం గోడౌన్ వద్ద బందోబస్తు నిర్వహించాలి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణలోని గోడౌన్‌లో ఉన్న ఈవీఎం భద్రత్రరూంను మంగళవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పరిశీలించారు. సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేసేలా చూడాలని.. ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం నిరంతరం బందోబస్తు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్ కామారెడ్డి తహసీల్దార్ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

కలెక్టరేట్‌తో పాటు ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ వాల్మీకి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం నిత్య నూతన గ్రంథమని ఆయన చూపిన సత్యం, ధర్మం, న్యాయం మార్గం ప్రతీ మనిషి జీవనానికి మార్గదర్శకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్, శిక్షణ కలెక్టర్ రవితేజ, డీఎస్‌సీడీవో వెంకటేష్, డీఎండబ్ల్యు సతీష్‌యాదవ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్, సహాయ బీసీ అభివృద్ధి అధికారి చక్రధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక అభివృద్ధికే సహకార సంఘాలు

- నాబార్డ్ డీడీఎం ప్రవీణ్‌కుమార్

లింగంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు విత్తనాలు, ఎరువులతో పాటు అతి తక్కువ వడ్డీరేటుకు రుణాలను ఇచ్చి రైతులను రాజులను చేసేందుకు సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని నాబార్డ్ డీడీఎం ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆయన మంగళవారం అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సందర్భంగా ఆయన లింగంపేట మండల కేంద్రంలోని సహకార సంఘంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సహకార సంఘాలు రైతులకు అనేక రకాల సేవలను అందిస్తున్నాయని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు. రైతులు ఎరువులు తక్కువ మోతాదులో వాడి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి నాగభూషణం, ఎన్‌డీసీసీ బ్యాంక్ డీజీఎమ్ లింబాద్రి, బ్యాంక్ మేనేజర్ రంజిత్, ఫీల్డ్ అధికారి రాకేష్, వివిధ సొసైటీల సీఈవోలు, రైతులు పాల్గొన్నారు.



ముఖాముఖి

పారదర్శకంగా మద్యం టెండర్లు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు

ప్రశ్న: జిల్లాలో ఎన్ని మద్యం షాపులకు టెండర్లు పిలుస్తున్నారు? టెండర్ దాఖలుకు చివరి తేదీ ఎప్పుడు?

జ: జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో మొత్తం 5 ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాల పరిధిలో మొత్తం 49 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ మద్యం దుకాణాలకు గతనెల 26 నుంచి టెండర్ల కోసం షెడ్యుల్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఈ నెల 18 దరఖాస్తులకు చివరి తేది. టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలే చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: మద్యం దుకాణాలకు రిజర్వేషన్‌లు ఏ విధంగా కేటాయించారు?

జ: జిల్లాలోని 49 మద్యం దుకాణాలను రిజర్వేషన్ల వారీగా కేటాయింపులు చేశాం. గౌడ కులస్తులకు 7, ఎస్సీ కులస్తులకు 5, ఎస్టీ కులస్తులకు 2, జనరల్ కేటగిరిలో 35 దుకాణాలు కేటాయింపులు జరిపాం.

ప్రశ్న: మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజు ఎంత?

జ: ఈసారి దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలకు పెంచింది. దరఖాస్తు చేసుకునేవారు రూ.3లక్షల డీడీ తీసి టెండర్లు వేయాలి.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. ఏ వైన్స్‌కు ఎక్కువగా వచ్చాయి?

జ: జిల్లాలో మొత్తం 49 వైన్స్‌లకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 14 వైన్స్‌లకు 33 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నిజాంసాగర్ వైన్స్‌కు అధికంగా 11 దరఖాస్తులు వచ్చాయి.

ప్రశ్న: ఎలా కేటాయించనున్నారు?

జ: కొత్త మద్యం పాలసీ ప్రకారం వైన్స్‌లకు దరఖాస్తులు స్వీకరించిన అనంతరం లక్కీడ్రా ద్వారా దుకాణాలను కేటాయించడం జరుగుతుంది. ఈనెల 23న మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ ఆధ్వర్యంలో లక్కీడ్రా తీయడం జరుగుతుంది.

• కామారెడ్డి టౌన్, ఆంధ్రజ్యోతి

రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలి



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే

- వరదలతో దెబ్బతిన్న రోడ్లకు అదనపు నిధులు కేటాయించాలని వినతి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే

కామారెడ్డి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఎమ్మెల్యే సీఎంకు వివరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నియోజకవర్గంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని శాశ్వత మరమ్మతులకు అదనపు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. అదనంగా ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనుల పురోగతి, ఇటీవల భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పోచారం ప్రాజెక్టు బలోపేతం, ప్రాజెక్టులో పూడికతొలగింపు చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టి అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఈ కేవైసీని త్వరగా పూర్తి చేయాలి

- డీఆర్డీవో సురేందర్



ఐకేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న సురేందర్

తాడ్వాయి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు సంబంధించి పూర్తిస్థాయిలో ఈ కేవైసీలు త్వరగా పూర్తి చేయాలని డీఆర్డీవో సురేందర్ అన్నారు. ఆయన మంగళవారం తాడ్వాయి మండలంలోని ఐకేపీ కార్యాలయంలో ఉపాధి హామీ, ఐకేపీ సిబ్బందితో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఈ కేవైసీ తక్కువగా ఉందని దానిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా ఉపాధి పనులకు సంబంధించి పూర్తి స్థాయిలో రైతులకు ఉపయోగకరమైన పనులను తీసుకోవాలన్నారు. చాలా గ్రామాల్లో ఈ కేవైసీ తక్కువగా చేయడం జరిగిందన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా ప్రస్తుతం చేపట్టబోయే పనులన్నీ యుక్త ద్వారా చేయడం జరుగుతుందని వాటికి సంబంధించిన లాగిన్ కూడా తొందరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే కాటిల్ షెడ్లు గొర్రెల షెడ్లు వాటితో పాటు రుణాలను రికవరీని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజు, ఏపీవో కృష్ణాగౌడ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, అకౌంటెంట్ తిరుపతి, శ్రీనిధి ప్రతినిధి సౌజన్య తదితరులు ఉన్నారు.

నేడు వరద నష్టంపై జిల్లాకు కేంద్ర బృందం

- నలుగురు సభ్యులతో కూడిన బృందం జిల్లాలో పర్యటన
- వరదలతో జరిగిన నష్టంపై అంచనా వేయనున్న బృందం

కామారెడ్డి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు, వరదలు తీవ్ర నష్టాన్ని చేకూర్చిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయా శాఖల మంత్రులతో కలిసి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. నష్టంపై అంచనాలు తయారు చేసి నివేదించాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో వరదల వల్ల రోడ్లు భవనాల, పంచాయతీరాజ్, నీటి పారుదల, వ్యవసాయ, మున్సిపల్ శాఖ

(మిగతా 8వ పేజీలో)

సోయా.. గయా..

కామారెడ్డి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు, వరదలు సోయా రైతులను నిండా ముంచాయి. వర్షాల కారణంగా సోయా రైతులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఎదురైంది. రోజుల తరబడి పంట వరదలోనే ఉండిపోవడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతోంది. గణనీయంగా దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదట్లో వర్షాలు అనుకూలంగా ఉంటాయని భావించిన రైతులు వేల ఎకరాల్లోనే సోయాను సాగు చేశారు. కానీ పంట చేతికి వచ్చే సమయంలో కురుస్తున్న వానలు పంటను దెబ్బ తీశాయి. జిల్లాలో సుమారు 40 శాతం మంది రైతులు సోయా సాగు చేస్తుంటారు. తమకు పెట్టుబడి కూడా రావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 83 వేల ఎకరాల్లో సోయా సాగు

జిల్లాలోని జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, పెద్దకొడప్‌గల్, పిట్లం, తాడ్వాయి, సదాశివనగర్, గాంధారి, రాజంపేట, రామారెడ్డి తదితర మండలాల్లో వేల ఎకరాల్లోనే రైతులు వర్షాధార పంటైన సోయాను సాగు చేస్తుంటారు. ఈ వానాకాలం సీజన్‌లోనూ జిల్లా వ్యాప్తంగా 83,220 ఎకరాల్లో పంటను రైతులు సాగు చేశారు. పంట సాగు చేసినప్పటికీ వర్షాలు సమృద్ధిగా కురిశాయి. గతంలో నీటి తడి ఇవ్వాల్సివచ్చేది. ఈ సారి అలాంటి అవసరం లేకుండా పోయింది. ఫలితంగా పంట బాగా పెరిగింది. రైతులు సంతోషించారు. పూత దశలో మరోసారి వర్షం కురువడంతో దిగుబడి పెరిగిందని ఆశ పడ్డారు. అయితే అధిక వానలు పంటను దెబ్బతీశాయి. తేమకు ఆకులు, పూత రాలిపోయేలా చేశాయి. రోజుల తరబడి వరద నీటిలోనే

(మిగతా 8వ పేజీలో)



బిచ్కుందలో మురిగిపోయిన సోయా పంట

మూడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి

- పండరి, సోయా రైతు, బిచ్కుంద



12 ఎకరాల్లో సోయా పంటను సాగు చేశాను. పంట పూత, కాత సమయంలో భారీ వర్షాలు కురువడం వరదల తాకిడికి పంటపై తీవ్ర ప్రభావం ఎదురైంది. వరద నీరు పంట చేనులోనే రోజుల తరబడి నిలిచిపోవడంతో తేమ శాతానికి సోయా కాత కాయలేదు. ఎకరాన 8 క్వింటాళ్లు దిగుబడి రావాల్సి ఉండగా ఈసారి 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. సగానికి పైగా దిగుబడి పడిపోయింది. దీంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది.

కష్టమంతా వృథా

- వెంకట్ పండరి, సోయా రైతు, బిచ్కుంద



నీటి సౌలభ్యం లేకపోవడంతో ఉన్న నాలుగు ఎకరాల్లో వర్షాధారంపై ఆధారపడి సోయాపంటను సాగు చేశాను. ఎకరాన 23వేల వరకు ఖర్చు చేసి పంట వేయగా ఆశించిన మేర దిగుబడులు రావడం లేదు. ఎకరాన 4 క్వింటాళ్లు మాత్రమే దిగుబడులు వస్తున్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనబడడం లేదు. పంట సాగుకు చేసిన కష్టమంతా వృథా అవుతుంది. భారీ వర్షాలు, వరదల వల్ల దిగుబడులు తగ్గిపోయాయి.

క్రైం సమాచారం

వృద్ధురాలిపై కుక్కల దాడి

బీర్కూర్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంగ్ఎడ్గిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నెల వ్యవధిలో ముగ్గురిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఇదిలా ఉండగా మంగళవారం గ్రామానికి చెందిన వృద్ధురాలిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు స్పందించి కుక్కలను తరిమేసి వృద్ధురాలిని కాపాడారు. అనంతరం ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

దోమకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష పడినట్లు ఎస్సై స్రవంతి మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనం నడుపుతున్న పాల్వంచ గ్రామానికి చెందిన జంగం సాంబశివుడు పట్టుబడ్డారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ టి. చంద్రశేఖర్ ఒక రోజు జైలుశిక్షతో పాటు రూ. వేయి జరిమానా విధించారు.

వరద కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి


రాజేందర్(ఫైల్)

కమ్మర్‌పల్లి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ సమీపంలోని ఇందిరమ్మ వరద కాలువలో పడి గల్లంతైన కమ్మర్‌పల్లికి చెందిన కొమిరె రాజేందర్(47) మరణించినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో రాజేందర్ తన దుస్తులకు బురద అంటిందని వరదకాలువలో కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా రాజేందర్ జాడ కనిపించలేదు. మంగళవారం ఉదయం వరదకాలువలో పడిన చోటనే మృతదేహం లభించింది. పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

నవీపేట,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో మంగళవారం తల్లెపల్లి వెంకన్న(45) అనే కూలీ మంగళవారం మృతి చెందాడని ఎస్సై తిరుపతి తెలిపారు. ఖమ్మం జిల్లా కారేపల్లికి చెందిన వెంకన్న మండలంలోని ఫకీరాబాద్ సమీపంలో జరుగుతున్న రైల్వే డబ్లింగ్ పనులలో కూలీ పని చేయడానికి మంగళవారం మరికొంత మందితో కలిసి వచ్చాడన్నారు. కూలీ పనిలో చేరకుండానే వెంకన్న కూలీ అనుమానాస్పదంగా మృతి చెందాడని, దీనిపై ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

మలేషియాలో తప్పిపోయిన బోధన్ వాసి

బోధన్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాకాసిపేట్‌కు చెందిన ప్యాట విజయ్‌కుమార్(38) మలేషియాలో 4నెలల క్రితం తప్పిపోయారని కుటుంబసభ్యులు తెలిపారు. తన భర్త జాడ వెతికి ఇండియాకు రప్పించాలని మంగళవారం హైదరాబాద్‌లో బేగంపేట ప్రజాభవన్‌లో సీఎం ప్రవాసి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రభుత్వ ఎన్ఆర్ఐ అడ్వైజరి కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి ఆమెకు మార్గదర్శనం చేశారు. 2025 మే 28న చెన్నై నుంచి కౌలాలంపూర్‌కు చేరుకున్న విజయ్ 2 రోజులు డ్యూటీ చేసిన తర్వాత మానసికంగా కుంగిపోయి అసహనంతో ప్రవర్తిస్తున్నాడని తెలియడంతో అతనిని ఇండియాకు వాపస్ తెప్పించడానికి విజయ్ భార్య జ్యోతి రిటర్న్ టిక్కెట్టు కోసం జూన్ 3న 30వేల రూపాయలు ఏజెంట్‌కు పంపించారు. కానీ జూన్ నుంచి అతడి జాడ తెలియరాలేదన్నారు. గతంలో ఆమె సహాయం కోసం జిల్లా ఎంపీ అరవింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా కలెక్టర్, బోధన్ పోలీసులను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ ఎన్ఆర్ఐ విభాగం నుంచి మలేషియాలోని ఇండియన్ హై కమిషన్‌కు సమాచారం ఇచ్చారని ఈ సందర్భంగా తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి జైలు

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన మాణిక్వాడ్ లాలేష్‌కు న్యూసెన్స్ కేసులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ 2రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. సోమవారం రాత్రి డయల్ 100 ద్వారా లాలేష్ పోలీసులను విసిగిస్తూ న్యూసెన్స్ చేయడంతో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కోర్టులో హాజరుపర్చగా జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

సారా విక్రేతకు ఏడాది..

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): సారా విక్రయించి పట్టుబడిన కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ మంగళవారం ఆర్మూర్ మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి నెల్లి సరళరాణి తీర్పు చెప్పినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.రామకృష్ణ తెలిపారు. కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌కు చెందిన పూజారి మౌనిక గతేడాది జనవరి 1న తన ఇంట్లో సారా విక్రయిస్తుండగా ఎక్సైజ్ ఎస్సై మానస పట్టుకుని కేసు నమోదు చేశారు. కోర్టులో నిందితురాలిని హాజరుపర్చగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముగ్గురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో మౌనికకు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


కనక స్వామి (ఫైల్)

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో రోడ్డుప్రమాదంలో మృతిచెందిన కనక స్వామి మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)కి చెందిన స్వామి ఇటీవల అక్కడ మృతిచెందాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి యాజమాన్యంతో మాట్లాడి స్వగ్రామానికి మృతదేహాన్ని పంపేలా ఏర్పాట్లు చేశామని గల్ఫ్ అసోసియేషన్ నాయకులు కిరణ్‌కుమార్, పెద్ది రవికుమార్, బొమ్మ ప్రవీణ్ తెలిపారు. సోమవారం రాత్రి దుబాయ్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోగానే ఎన్ఆర్ఐ అధికారి చిట్టిబాబు అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నిజాంసాగర్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మహ్మద్‌నగర్ మండలకేంద్రం శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ ఉమాకాంత్ హఠాన్మరణం


ఉమాకాంత్(ఫైల్)

బోధన్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరాజ్‌పల్లికి చెందిన బోధన్ ఆంధ్రప్రభ సీనియర్ జర్నలిస్ట్ జంగం ఉమాకాంత్ మంగళవారం గుండెపోటుతో అకాల మరణం పొందారు. ప్రజాప్రతినిధులు, బోధన్ డివిజన్ జర్నలిస్టులు, పలు గ్రామాల పెద్దలు, పలు పార్టీల నాయకులు ఉమాకాంత్ మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమాకాంత్ కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. ఆయన మరణం తీరనిలోటని కొనియాడారు.

ముగ్గురికి జైలు, 13మందికి జరిమానా

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ తీర్పు వెల్లడించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. 16 మందిని మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 13మందికి 19,500 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని తెలిపారు. మిగతా ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. నగరంలో తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వాహనదారులు ఖచ్చితంగా రోడ్డుభద్రతా నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. లేకుంటే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్యా'రేట్' హై..!

మార్కెట్‌లో కిలో ధర రూ.100 ● ముందుకురాని వినియోగదారులు ● అమ్మడానికి వ్యాపారులు సైతం వెనకడగుగు



నందిపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో ప్రతీ నెలా ఏదో ఒక కూరగాయ ధర ఆకాశాన్నంటుతోంది. ప్రస్తుతం మార్కెట్లో క్యారెట్ ధర చుక్కలు చూపిస్తోంది. కిలో క్యారెట్ ధర వంద రూపాయలు పలుకుతోంది. మొన్నటి వరకు నవరాత్రులు కావడంతో ఎక్కువ మంది శాఖాహారం వైపు మొగ్గు చూపడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. అయితే నవరాత్రులు ముగిసిన తర్వాత కూడా కూరగాయల ధరలు మార్కెట్లో నువ్వా-నేనా అన్నట్లుగా పోటీ పడుతున్నాయి. ఒక్కో వారం ఒక కూరగాయ ధర రికార్డు స్థాయిలో నమోదవుతోంది. నిన్న, మొన్నటి వరకు ఉల్లిపాయలు, టమాట, పచ్చి మిర్చి, చిక్కుడు, వంకాయ ధరలు పెరిగిపోయాయి. సహజంగా మార్కెట్‌లో కిలో క్యారెట్ ధర రూ.20 నుంచి రూ.40కి మించదు. కాని ఈ వారం క్యారెట్ ధర మార్కెట్‌లో వందకు చేరింది. దీంతో మార్కెట్‌లో వ్యాపారులు సైతం దీనిని విక్రయించేందుకు ముందుకురావడం లేదు. వినియోగదారులు సైతం అదే కోవాలో పడ్డారు. కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. అధిక వర్షాలతో బెంగళూరు, ఊటీలో క్యారెట్ పంట దిగుబడులు తగ్గడంతో ఒక్కసారిగా ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. అంతే కాకుండా రోజు కురుస్తున్న అకాల వర్షాలకు క్యారెట్ కుళ్ళిపోవడంతో దిగుమతి తగ్గి, ధర పెరిగిందని ఓ వ్యాపారి ఆంధ్రజ్యోతితో తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

బోధన్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లో ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించమే లక్ష్యంగా విధులు నిర్వస్తున్నామని జిల్లా స్థాయిలో బోధన్‌తో పాటు రుద్రూర్ డివిజన్‌లు ప్రతిభ కనబర్చాయని ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్ అన్నారు. మంగళవారం బోధన్ డివిజన్ కార్యాలయంలో ఉత్తమ ప్రతిభకనబర్చిన బోధన్, రుద్రూర్ డివిజన్‌ల సంబంధిత అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి సమష్టిగా కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఈలు ప్రభాకర్, నగేష్ కుమార్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.


బోధన్, రుద్రూర్ డివిజన్ల అధికారులను సన్మానిస్తున్న డీఈ

పాలస్తీనాపై దాడులు నిలిపివేయాలి



వెల్మల్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నేతలు

నందిపేట, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): అమెరికా మద్దతుతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలని సీపీఐఎం(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. పాలస్తీనా ప్రజాపోరాటానికి మద్దతుగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వెల్మల్‌లో ప్రదర్శన నిర్వహించారు. గత రెండు సంవత్సరాలుగా అమెరికా తన స్వార్థం కోసం పాలస్తీనాపై దాడులను ప్రోత్సహిస్తోందని దాసు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 60వేల మంది ప్రజలు దాడుల్లో మృతి చెందారని, భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజలకు మద్దతు తెలపాలని, ప్రజాస్వామ్య రక్షణ కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి అబ్దుల్, నాయకులు దేవన్న, దొనపల్లి లింగన్న, భాజన్న, గంగారాం, ఆశీర్వాదం తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రవీణ్


ప్రవీణ్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ నేతలు

ఏర్గట్ల, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్తిలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మగ్గిడి ప్రవీణ్ పీఆర్టీయూకు చేస్తున్న సేవలను గుర్తించి సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఇచ్చినట్లు మండల అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన మగ్గిడి ప్రవీణ్‌ను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, జిల్లాకార్యదర్శి గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ కోసం ఒక్కటైన రెండు వర్గాలు


సమావేశంలో పాల్గొన్న ఇరువర్గాల నాయకులు

మోస్రా,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మోస్రా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వర్గీయులు సమావేశంలో పాల్గొని వర్గవిభేదాలు పక్కనపెట్టారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ కోసం అందరూ కలవడం సంతోషంగా ఉందన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, కిసాన్ మోర్చా నాయకులు

ఆర్మూర్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వరి పంటకు బోనస్ ఇవ్వాలని రైతులు, కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతి పత్రం అందజేశారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో మొక్కజొన్న పంట కోసిన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, గత్యంతరం లేక దళారులకు విక్రయించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, బాజన్న, ప్రశాంత్, గంగాధర్, బాజన్న, సంజీవ్, రాజశేఖర్, రాజేష్, భాజన్న, తదితరులు పాల్గొన్నారు.

మద్యంషాపులకు దరఖాస్తులు


బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు

బోధన్‌అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 18 వైన్స్ షాపులున్నాయని, వీటికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు తెలిపారు. డివిజన్‌లో ఎస్సీ కోటాలో 2, బోధన్ 1, కోటగిరి 1, గౌడ్స్ 1, సాటాపూర్ 1 రిజర్వ్ చేసినట్లు వెల్లడించారు. రూ.3 లక్షల నాన్ రిఫర్ డీడీతో అక్టోబరు 18 వరకు జిల్లాకేంద్రంలోని డీటీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైన్స్ లక్కీ డ్రాలో పాల్గొనే వారు రూ.3 లక్షల రూపాయల డీడీ చెల్లించాలన్నారు. అక్టోబర్ 23న లక్కీడ్రా తీస్తారని చెప్పారు. కొత్త వైన్స్ షాపులు డిసెంబర్ 1 నుంచి ప్రారంభం అవుతాయన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు డీడీ, 3 ఫోటోలు, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్, కాస్ట్ జిరాక్స్ జతపర్చాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీఐ వినోద్

జక్రాన్‌పల్లి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ అన్నారు. మంగళవారం జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులకు ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం తెలపవద్దని పేర్కొన్నారు. గ్రామాలలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వివరాలను పోలీస్‌లకు తెలపాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎండీ మాలిక్ రెహ్మాన్ పాల్గొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ


చేపూర్‌లో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఆర్మూర్,అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మారా చంద్రమోహన్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ సర్కార్ ఓటు చోరీకి పాల్పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, పండిత్ పవన్, శ్రీను, వెంకట్‌రాంరెడ్డి, శ్రీకాంత్, రామ్‌సన్, మాజీ ఎంపీటీసీలు గంగాధర్, రంజిత్, సురేష్‌రాజు, శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కోర్సులో శిక్షణకు..

ఆర్మూర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పెర్కిట్‌లోని దుర్గాబాయి మహిళ శిశువికాస కేంద్రం(మహిళ ప్రాంగణం)లో కమ్యూనిటీ హెల్త్‌వర్కర్(నర్సింగ్), టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థినులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారిణి ఇందిరా కోరారు. 18-35 ఏళ్ల మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సింగ్ కోర్సుకు 10వ తరగతి మెమో, టైలరింగ్, బ్యూటిషియన్ కోర్సులకు 8వ తరగతి విద్యార్హత, బోనాఫైడ్‌లతో పాటు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు 4 పాస్ పోర్టు సైజు ఫొటోలతో ఈనెల 16 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.వివరాలకు 7660022520,8332949550లోసంప్రదించాలన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు


బినోలలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలలో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వాల్మీకి సమాధి వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి తమ ప్రాంతంలో నడయాడినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. పురోహితులు గణేష్, పాల్గొన్నారు.


పోతంగల్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కోటగిరి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పోతంగల్‌లో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ప్రపంచం ఉన్నంత వరకు వాల్మీకి మహర్షి రాసిన రామాయణం ఆయన చరిత్ర ఉంటుందన్నారు. కార్యక్రమంలో రమేష్, ఉదయ్ భాస్కర్, గణేష్, వెంకట్, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాకోర విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు


జి.అరవింద్

వర్ని, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): జాకోర గ్రామానికి చెందిన విద్యార్థి జి.అరవింద్ సిదిపేట జిల్లా ములుగు మండలం లక్కంపల్లిలోని ఆర్‌వీఎం ఇన్‌స్టిట్యూట్‌లో ఎంబీబీ ఎస్ సీటు సాధించారు. ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు వర్నిలో చదివిన అరవింద్ 5 నుంచి ఇంటర్ వరకు భిక్క నూరులోని గురుకులంలో విద్యనభ్యసించారు. అనంతరం మెడికల్ సైన్స్ రీసెర్చ్ సెంటర్ లక్కంపల్లిలో చేరారు. ఉన్నతరంగంలో రాణి స్తానని అరవింద్ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఏర్గట్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర అందించేలా చూడాలని మండలంలోని గుమ్మిర్యాల్‌కు చెందిన రైతులు మంగళవారం తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. మొక్కజొన్న పంట చేతికి వచ్చిందని భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు మొక్కజొన్న నిల్వ చేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. పంట వర్షంలో తడిసిపోయే ప్రమాదం ఉందని, దీంతో రైతులకు తీవ్ర నష్టం జరిగే అవకాశాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో రైతులు సోమ రాజారెడ్డి, ముక్కెర దేవన్న యదవ్, రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో పోషణ అభియాన్

ముప్కాల్ ,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారంలో పోషకాల వివరాలను తల్లులకు వివరించారు. ఎంపీవో గౌసిమోహినోద్దిన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి, పంచాయతీ సెక్రటరీ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు

కోటి దీపోత్సవానికి ఆహ్వానం

మోర్తాడ్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం గ్రామానికి చెందిన వేద పండితులు సాహసం రంజిత్‌కుమార్ శర్మకు శేర్‌లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆహ్వానపత్రికలను అందజేశారు. హైదరాబాద్‌లోని గాజుల రామారంలో నిర్వహిస్తున్న కోటి దిపోత్సవానికి రంజిత్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించాలని వారు ఆహ్వానించారు.

చట్టాలపై అవగాహన అవసరం

కోటగిరి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): బాలికల భద్రతపై కోటగిరి పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలో షీటీమ్ ఆధ్వర్యంలో బాలికల భద్రతపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు ఆశన్న, రాధిక, బన్సీలాల్ పాల్గొన్నారు.

వంటశాల నిర్మాణానికి భూమిపూజ

కమ్మర్‌పల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉప్లూర్ శివారులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో వంటశాల నిర్మాణానికి మంగళవారం ఆలయ కమిటీ భూమిపూజ చేసింది. కార్యక్రమంలో సభ్యులు పోలపల్లి లచ్చయ్య, బద్దం గంగారెడ్డి, యెనుగందుల శశిధర్, పెంబర్తి నరేష్ కుమార్, పోతు మురళి, పోతు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయం

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్ క్లాక్ టవర్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో సీజేఐ బీఆర్ గవాయ్‌పై అడ్వకేట్ దాడి చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. నిందితుడు రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రజాస్వామ్యం రాజ్యంగంపై జరిగిన దాడిగా దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు అశోక్, మాజీ జడ్పీచైర్మన్ సదానందం, చంద్రయ్య, పెద్ద బోజన్న, భూమన్న, భూమేశ్వర్, గంగాధర్, రాజన్న, పూర్ణా, చందు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని మున్సిఫ్‌కోర్టు ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీజేఐ గవాయ్‌పై దాడికి నిరసనగా న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ లో సమావేశమై న్యాయవాది రాకేష్ కిషోర్ ప్రవర్తనను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యల వల్ల న్యాయవాద వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందని ప్రతీ న్యాయవాది ఖండించాల్సిన అవసరం ఉంద న్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, సీనియర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, సదానందం, కిష్టయ్య, అమితాబ్ కిరాడ్, ఆనంద్, చైతన్య పాల్గొన్నారు.

న్యాయవాది సభ్యత్వం రద్దు చేయాలి

కమ్మర్‌పల్లి, అక్టోబరు 7: (ఆంధ్రజ్యోతి)దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూరి గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమ్మర్‌పల్లి అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం కమ్మర్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో ఏవైఎస్ మండల అధ్యక్షుడు సుంకరి విజయ్‌కుమార్ మాట్లాడారు. దేశ ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేయడమంటే దేశప్రజాస్వామ్యంపై, భారత రాజ్యాంగంపై దాడి చేయడమే అవుతుందన్నారు. బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దుచేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే న్యాయవాది రాకేష్ కిషోర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏవైఎస్ మండల క్రియాశీలక సభ్యులు కొంటికంటి నరేందర్, పాలెపు రాజేశ్వర్, రామాంజనేయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏవైఎస్ మండల అధ్యక్షుడు విజయ్



సమీక్ష నిర్వహిస్తున్న డీసీవో రామ్మోహన్‌రావు

వరి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

బాన్సువాడటౌన్ , అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం డీసీవో రామ్మోహన్‌రావు వరి ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2386, రెండవ రకం ధాన్యానికి రూ.2369 మద్దతు ధర చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సొసైటీ కార్యదర్శులు, ఆపరేటర్లు తదితరులున్నారు.

డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువు పెంపు

సుభాష్‌నగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ అడ్మిషన్ గడువును ఈనెల 10వ తేదీ వరకు పెంచుతున్నట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రంజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంపీసీ, బీజెడ్‌సీ కోర్సులు ఉన్నాయని తెలిపారు. పీజీలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంఏలో ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, జర్నలిజం కోర్సులు ఉన్నట్లు చెప్పారు. ఎంఎస్సీలో మ్యాథమెటిక్స్‌తో పాటు ఈ సంవత్సరం నుంచి బోటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఐసెట్‌లో అర్హత పొందిన విద్యార్థులు ఎంబీఏలో ప్రవేశం పొందవచ్చని, బీఎల్ఐఎస్సీ కోర్సులు కూడా అందుబాటులో ఉందని వివరించారు. 2024-25 సంవత్సరంలో యూజీ, పీజీలలో అడ్మిషన్ తీసుకున్న మొదటి సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఈనెల 10 చివరి తేదీ అని తెలిపారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తులు ఎస్‌హెచ్‌వోలో అందజేయాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాదారుల దరఖాస్తుల రద్దీ దృష్ట్యా నిజామాబాద్, ఆర్మూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దరఖాస్తుదారులు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్టేషన్‌లో అందజేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి కోరారు. నిజామాబాద్ స్టేషన్ పరిధిలోని గెజిట్ నంబర్ 1 నుంచి 36 వరకు, ఆర్మూర్ స్టేషన్ పరిధిలోని గెజిట్ నంబర్- 55 నుంచి 79 వరకు దరఖాస్తులను సుభాష్‌నగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల పక్కనగల ఎస్‌హెచ్‌వో భవనంలో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. మిగిలిన బోధన్, భీంగల్, మోర్తాడ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాదారులకు సంబంధించిన దరఖాస్తులు యదావిధిగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలోనే దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. మిగతా వివరాల కోసం 8712658973 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం పెర్కిట్‌లో నర్సింగ్ 3 నెలల శిక్షణ, టైలరింగ్, బ్యూటీషియన్ నెలరోజుల శిక్షణను ప్రారంభిస్తున్నట్లు దుర్గాబాయి మహిళా శిశు విజ్ఞాన కేంద్రం అధికారి ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కోసం మహిళలు 18-35 సంవత్సరాల వయస్సుగల వారు అర్హులని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్ శిక్షణ కొరకు దరఖాస్తు చేయడానికి ఎస్సెస్సీ మెమో, టైలరింగ్, బ్యూటీషియన్ కొరకు 8వ తరగతి విద్యార్హత బోనాఫైడ్‌తో పాటు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, 4 పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలతో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 16లోపు అందజేయాలని తెలిపారు. వివరాల కోసం 7660022520, 8332949550 నంబర్లను సంప్రదించాలని కోరారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు

రూరల్ ఎమ్మెల్యేకు పరామర్శ

ఇందూరు, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పరామర్శించారు. ఇటీవల భూపతిరెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు మంగళవారం నగరంలోని బైపాస్ రోడ్‌లోగల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పత్తికి కుళ్లు.. రైతుకు కన్నీళ్లు

మద్నూర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంట పాడవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడితో సాగుచేసిన పంట దిగుబడులు వచ్చే సమయంలో వర్షాలు కురిసి పాడయిపోతున్నందున అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఏడాది తొలకరిలో అనుకూలంగా వర్షాలు కురిసినప్పటికీ దిగుబడుల సమయంలో కురుస్తున్న వర్షాలతో పత్తి కాయలు పూర్తిగా కుళ్లిపోతున్నాయని అన్నదాతలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

● **అతివృష్టితో అధిక నష్టం**

ఈ ఏడాది కురిసిన వర్షాలు పత్తికి అనుకూలంగా ఉండగా, అధిక దిగుబడులు వస్తాయని ఆశించిన రైతులకు గత రెండు నెలల క్రితం అతివృష్టితో పూర్తిస్థాయిలో నష్టం జరిగే ప్రమాదం ఏర్పడింది. ప్రస్తుతం అధిక తేమతో కూడిన వాతావరణ పరిస్థితిలో పత్తి కాయకు కుళ్లు, తెగులు, ఆకుమచ్చలు ఆశించే అవకాశం ఉందని మద్నూర్ మండల వ్యవసాయ అధికారి రాజు సూచిస్తున్నారు.

● **వ్యవసాయ అధికారుల సూచనలు**

వ్యవసాయ అధికారులు పత్తి పంటలో వచ్చే వివిధ రకాల వ్యాధుల నివారణ కోసం పలు సూచనలు చేస్తున్నారు. 0.2 గ్రాము ప్లాంట మైసిన్, 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెబుతున్నారు. అలాగే ప్రస్తుత పరిస్థితిలో గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉందని, దాని నివారణ కోసం 2 మి.లీ. ప్రొఫినోఫాస్ లేదా 1.5 గ్రాముల థయోడి కార్బ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెబుతున్నారు. రైతులు పత్తిలో ఆల్టేనియా ఆకుమచ్చ తెగులు గుర్తించటానికి ఈ లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఆల్ట్రేనియా అనే శిలీంధ్రం వలన ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు వలయాకారపు నుడులుగా, రింగులుగా ఏర్పడతాయని, తెగులు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు తర్వాత దశలలో కాయల మీద కూడా మచ్చలు కనబడతాయన్నారు. ఈ తెగులు ఎక్కువగా గాలి ద్వారా వ్యాపిస్తుందని



పంటలో తెగుళ్లు



అత్యధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

మబ్బులతో కూడిన వర్షపు వాతావరణంతో ఈ తెగులు ఎక్కువగా గమనించవచ్చని పేర్కొన్నారు. దీని నివారణ కోసం కిలో విత్తనానికి రెండు కార్బన్ డాజిం లేదా 10 గ్రా. ట్రైకో డేర్మ విరీడి తో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని సూచించారు. పత్తి రైతులు చివరి దశలో ఉన్న పత్తిని కాపాడుకోవడానికి వ్యవసాయ విస్తీర్ణం అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు.



బీర్కూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

బీర్కూర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసుకోవాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం ఆమె బీర్కూర్ మండలంలోని బీర్కూర్, దామరంచ, కిస్తాపూర్, వీరాపూర్, తిమ్మాపూర్ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నవారికి వెంటనే బిల్లులు చెల్లిస్తామన్నారు. ఇళ్లు మంజూరైన వారిలో ఎవరైనా అనర్హులున్నారా అనే దానిపై ఆరా తీశారు. ఆమె వెంట ఎంపీడీవో మహబూబ్, తహసీల్దార్ సాయి భుజంగ రావు, ఆర్ఐ విజయ్, ఆయా గ్రామాల గ్రామ పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు ఉన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలి

ఎల్లారెడ్డి, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలు, ఆశావాహ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యవహారాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో వివరించి అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, పట్టణ అధ్యక్షుడు రాజేష్, బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నరేష్, శంకర్ లక్ష్మారెడ్డి, ఎస్ఎస్ రెడ్డి, కాశీనాథ్, నరసింహారెడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలతో నష్టం

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలను ద్వారా ప్రజలు మోసపోతున్నారని, అలాంటి వాటిపై నమ్మకం మంచిది కాదని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో కూడా మూఢనమ్మకాలు బాగా పెరుగుతున్నాయని అన్నారు. బాణామతి, చేతబడుల వంటి వాటి పేరుతో అమాయక ప్రజలను పలువురు హింసిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వేముల శేఖర్, బలియ పాల్గొన్నారు.

కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఎల్లారెడ్డి, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థకు భంగం కలిగే ఎలాంటి చర్యలనైనా తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎల్లారెడ్డి కోర్టు ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై న్యాయవాది దాడి చేసేందుకు యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రావు మాట్లాడుతూ.. న్యాయవాదుల హక్కులు, న్యాయస్థానాల గౌరవం కాపాడడంలో బార్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కోర్టుల గౌరవాన్ని కాపాడుకోవడం సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. సుప్రీంకోర్టులో జరిగిన సంఘటన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ అని అభిప్రాయపడ్డారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు పద్మ పండరి, సతీష్, నామ శ్రీకాంత్, నాగం సాయిబాబా, నామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను రక్షించడం అందరి బాధ్యత

కామారెడ్డిటౌన్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): చిన్నారుల హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి నాగరాణి అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలసదనంను సందర్శించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. బాలసదన్‌లో సంరక్షణలో ఉన్న పిల్లల ఆరోగ్యం, విద్య, ఇతర అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు న్యాయసంబంధిత అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో ప్రమీల, డీసీపీఓ స్రవంతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ అంజయ్య, సీడబ్ల్యూసీ మెంబర్స్ ఖాజా నాజిముద్దీన్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వాల్మీకి జయంతి వేడుకలు

మద్నూర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రంలోని మహర్షి వాల్మీకి ఆలయంలో ఆయన జయంతి వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా నిర్మించిన వాల్మీకి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదమంత్రోచ్ఛరణలతో అభిషేకం పూజలు, హారతి మహోత్సవం జరిపారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు అశోక్, సాయిలు, నాందేవ్ మేస్త్రీ, యాదు మేస్త్రీ, రాహుల్, తులసీరాం, రాజు, సాహెబ్ రావ్, సాయిలు, లక్ష్మణ్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

9న ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

సుభాష్‌నగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా అండర్-19 బాలికల జట్టు ఎంపికలను ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ తెలిపారు. నగరంలోని రాజారాం స్టేడియంలో ఉదయం 10గంటలకు ఈ ఎంపికలను నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12, 13వ తేదీలలో సంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మరింత రాణించి జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలని కోరారు.

నేడు మండల కేంద్రంలో పోషణ మాసోత్సవం

నవీపేట, అక్టోబరు7, (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నవీపేట మండల కేంద్రంలో పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్‌లు రాధాలక్ష్మి, భాగ్యలక్ష్మిలు తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు స్థానిక రైతు వేదికలో జరిగే ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు హజరుకావాలని వారు కోరారు. తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.


ఒక్క యాప్‌తో గైర్హాజరుకు చెక్..!

» వైద్యశాఖలో అబాస్ యాప్ » మద్నూరు మండలంలో పక్కాగా అమలు » అవకతవకలకు అవకాశం లేదిక

మద్నూర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి డుమ్మాలు కొట్టే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందికి అబాస్ యాప్‌ను అమల్లోకి తెచ్చి తెలంగాణ ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ చెక్ పెట్టిన విషయం తెలిసిందే. ఇష్టం వచ్చినప్పుడు ఉద్యోగానికి వెళ్తాం, వెళ్లినప్పుడే రిజిస్టర్‌లో సంతకాలు పెడతాం అంటే కుదరదు. పనిచేసే చోటుకు వెళ్లి మొబైల్ ఫోన్‌లోని అబాస్ (ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం) యాప్‌లో ముఖం చూపితేనే హాజరు పడుతుంది. ఈ విధానం గత నెల 1 నుంచి కొనసాగుతుండగా ఉమ్మడి మద్నూర్ మండలంలో అమలవుతోంది.

● **గతంలో ఆరోపణలు**

ఉమ్మడి మద్నూర్ మండలంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ దవాఖానాలలో పనిచేసే డాక్టర్లు, సిబ్బంది తమకు ఇష్టం వచ్చినప్పుడు వస్తూ, వెళ్తున్నారని గతంలో పలు ఆరోపణలు వచ్చాయి. సమయపాలన పాటించకుండా, వంతుల వారీగా విధులకు హాజరవుతున్నారని, వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే వచ్చి మిగతా రోజులు అటెండెన్స్ వచ్చిన రోజు లిస్టులో వేసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఇంకొంతమంది క్షేత్రస్థాయి పరిశీలన సర్వేలు అంటూ విధులకు హాజరుకాని ఘటనలూ ఉన్నాయి.



మద్నూర్ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి


● **యాప్ రాకతో హాజరు పక్కా**

అయితే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త విధానంతో అధికారుల గైర్హాజరుకు పూర్తిగా చెక్ పడింది. ఈ యాప్ ఉద్యోగులు పనిచేసే ఆసుపత్రి పరిసరాల్లోనే ఓపెన్ అవుతుంది. మొబైల్ ద్వారా ఫేస్ రికగ్నేషన్ విధానంతో హాజరు నమోదు అవుతుంది. ఎక్కడి నుంచో ఈ యాప్ ఓపెన్ చేసి హాజరు వేయడానికి వీలు ఉండదు. అలా చేస్తే అటెండెన్స్ పడదు. దీంతో హాజరులో అవకతవకలు చేసేందుకు అవకాశం లేదు.

ఆర్టీసీకి దసరా ధమాకా

» దసరా చాలెంజ్‌లో రాష్ట్రంలోనే రెండవ స్థానం » నిజామాబాద్ రీజియన్‌కు రూ.1.19 కోట్ల ఆదాయం

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రీజియన్‌కు దసరా పండుగ కలిసి వచ్చింది. నిజామాబాద్ రీజియన్ పరిధిలో దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 6 వరకు ప్రత్యేక బస్సులను వివిధ ప్రాంతాలకు నడిపించారు. రాష్ట్రంలోని దసరా చాలెంజ్‌లో నిజామాబాద్ రీజియన్ ఆదాయంలో రెండో స్థానంలో నిలిచింది. సుమారు 566 ప్రత్యేక బస్సులను నడిపి ఆదాయాన్ని ఆర్జించింది. నిజామాబాద్ జిల్లాకు ఒకకోటి 17లక్షలు టార్గెట్‌ను నిర్ధారించగా రూ. ఒక కోటి 19లక్షల ఆదాయం సమకూర్చుకుంది. సుమారు రూ. 2లక్షల ఆదాయాన్ని అదనంగా ఆర్జించింది. దసరా పండుగ రద్దీని సమర్థవంతంగా ఎదుర్కొని అదనపు సర్వీసులను నడిపింది. నిజామాబాద్ రీజియన్‌లోని 6 డిపోలలో ప్రత్యేక బస్సులను సుదూర ప్రాంతాలతో పాటు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు పల్లెలకు బస్సులను నడిపింది. ప్రయాణికుల రద్దీతో ఆర్టీసీ యాజమాన్యం ఇబ్బందులు ఎదుర్కొన్న ఆదాయంలో మాత్రం రెండో స్థానంలో నిలిచింది. ఆర్మూర్ డిపో 17లక్షల 30వేలు, బోధన్ 28లక్షల 25వేలు, నిజామాబాద్ డిపో-1 24లక్షల 26వేలు, నిజామాబాద్ డిపో-2 24లక్షల 61వేలు, బాన్సువాడ 12లక్షల 55వేలు, కామారెడ్డి 18లక్షల 13వేలు, మొత్తం ఒక కోటి 19లక్షల ఆదాయాన్ని ఆర్జించింది. పండగ సమయంలో అధిక వాహనాలు నడిపి ప్రజలకు సకాలంలో సేవలు అందించిన డ్రైవర్లు, కండక్టర్లకు, డిపో సిబ్బందికి ఆర్ఎం జ్యోత్స్న, డీవీఎం మధుసూదన్, సీవో పద్మజ, ఏవో పరమాత్మలు ధన్యవాదాలు తెలిపారు. సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి బహుమతులను అందజేశారు. ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ సిబ్బందితో ఆర్ఎం జ్యోత్స్న



నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే సహించం

కామారెడ్డిటౌన్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారి వైఖరిని నిరసిస్తూ మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద గల పూలే విగ్రహం వద్ద బీసీ సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థిసంఘ జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులపై రాజకీయ పార్టీల అధినేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడానికి కారణం భారతీయ జనతా పార్టీనే అని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదించాలని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదించకపోతే రాష్ట్రగవర్నర్ రాజీనామా చేసేలా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌చారి, అబ్దుల్ అజీజ్, కొత్తపల్లిమల్లన్న, వినోద్, దయాకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

32 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు

రాజంపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని పీహెచ్‌సీలో ఆరోగ్యమహిళ కార్యక్రమాన్ని డా.విజయమహాలక్ష్మీ, మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుమారు 45 మంది మహిళలకు ఆరోగ్యంపై పలుసూచనలు చేశామన్నారు. అవసరమైన వారికి ల్యాబ్‌లో రక్తపరీక్షలు, 32 మంది మహిళలకు మందులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహ్మద్ మంజూర్, గంగామణి, హెల్త్ ఎడ్యుకేటర్ భీమ్, స్టాఫ్‌నర్స్ ఇందిరా, ఫార్మాసిస్ట్ పద్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఇస్రోజివాడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూరగాయల సాగుపై అవగాహన

కామారెడ్డి రూరల్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో దేవేంద్ర రైతులకు టమాట, వంకాయ పంటల సాగు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కపాస్ కిసాన్ యాప్‌పై పత్తి రైతులకు అవగాహన కల్పించారు. ఫోన్ ఈ యాప్ ద్వారా పత్తి విక్రయించేందుకు స్లాట్ బుక్ చేసుకునే విధానాన్ని వివరించారు. రైతులు పంటలు సాగు చేసుకునే సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● గాంధారి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గం గ్రామంలో మంగళవారం వరి, పత్తి పంటలను మండల వ్యవసాయాధికారి రాజలింగం పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు వరి, పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వారు వివరించారు. రైతులు పంటకు తెగులు గమనించి తగిన నియంత్రణ చర్యలకు తమ అధికారులను సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.



భీం వర్ధంతి నిర్వహిస్తున్న ఆదివాసీ ప్రతినిధులు

కొమురం భీం వర్ధంతి

మహమ్మద్‌నగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యో తి): మండలంలోని బూర్గుల్ గ్రామంలో ఆది వాసీ నాయక్ పోడ్ జిల్లాకమిటీ, కుల పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం కొమురం భీం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భీం చిత్రపటానికి నాయకులు, కుల పెద్దలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కమిటీ జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య మాట్లాడుతూ.. కొమురం భీం ఆశయాలకు అనుగుణంగా జాతి అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో కోశాధికారి సాయిబాబా, జీపీవో అంజనేయులు, కుల పెద్దలు కాశీరాం భూమ య్య, రాజు, సాయిలు, విఠల్, సాయిరాం, నా యకులు పాల్గొన్నారు.

ఓపెన్ 'ప్లాట్లు'

● దోమలకు ఆవాసాలుగా ఓపెన్ ప్లాట్లు
● కొరవడిన అధికారుల పర్యవేక్షణ
● ప్రజలకు తప్పని ఇబ్బందులు

ఎల్లారెడ్డి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఓపెన్ ప్లాట్లు స్థానిక ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, మురుగు నీటితో నిండి దోమలు, ఈగలు పందులకు ఆవాసాలుగా మారాయి. కొన్నిచోట్ల మురికి కాలువలను తలపిస్తున్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పట్లేదు.

● చెత్తకు చిరునామాగా ప్లాట్లు

ఎల్లారెడ్డి మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత చుట్టు పక్కల భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో చాలామంది వారి భవిష్యత్తు అవసరాల కోసం ప్లాట్లు కొనుగోలు చేసి పెట్టుకున్నారు. భవిష్యత్తులో ఇల్లు నిర్మించుకోవాలని వారి ఆలోచన. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొనుగోలు చేసిన ప్లాట్లకు ఎలాంటి రక్షణ గోడలు నిర్మించకుండా వదిలేశారు. దీంతో స్థానికంగా వారు ఈ ఖాళీ ప్లాట్‌లను చెత్తకుండీలా వినియోగిస్తున్నారు.

● అనుమతులు లేకుండా వెంచర్లు

పట్టణంలో చాలా చోట్ల ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలోనే ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేశారు. సదరు ప్లాట్‌లలో ఇళ్లు నిర్మించుకున్న వారికి సరైన డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరంతా ఓపెన్ ప్లాట్లలోకి చేరుతుంది. దీంతో కాలనీలో ప్రజల తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీనికితోడు ప్లాట్ల చుట్టూ ఎలాంటి రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడంతో వాటిలో పిచ్చి మొక్కలు పెరగడంతో వాటిని తొలగించడం కష్టతరమవుతోంది. మున్సిపల్ పరిధిలోని చాలా కాలనీలలో దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఖాళీ ప్లాట్‌లలో మురుగునీరు పిచ్చి మొక్కలు ఉండడంతో



ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో ఓపెన్ ప్లాట్‌లలో నిలిచిన నీరు

దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయి ప్లాట్లను పందులు తమ ఆవాసాలుగా మార్చుకున్నాయి. వీటి ద్వారా పలువురు రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి రక్షణ గోడలు నిర్మించని ప్లాట్ల యజమానులను గుర్తించి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసి జరిమాన విధించాలని పలువురు పట్టణ ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. రక్షణ కోడలు నిర్మించని ప్లాట్ల యజమానులపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటితో ఇబ్బంది పడుతున్న పట్టణ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

తాడ్వాయి, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. మండలానికి చెందిన మైనారిటీ, బీఆర్ఎస్ నాయకుడు సోషల్ మీడియాలో వచ్చిన పోస్టును మరొక సోషల్ మీడియాలో పెట్టగా దాన్ని చూసి తాడ్వాయి పోలీసులు స్టేషన్‌కు రావాలని తెలిపారు. ఈ అంశాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివచ్చి రాస్తారోకో చేశారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులను ఇంకో గ్రూపులో పెట్టడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారని టీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఇందులో బిఆర్ఎస్ నాయకులు కపిల్ రెడ్డి, ముదాం నర్సింలు, రవి, సంజీవరెడ్డి, మంగారెడ్డి, మండల టిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు బాధాకరం

కామారెడ్డిటౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో మైనార్టీలు ఏర్పాటుచేసిన సభకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమయ్య అన్నారు. మంగళవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహచర మంత్రి అనికూడా చూడకుండా మంత్రి లక్ష్మణ్‌ను జంతువులతో పోల్చిన పొన్నం అహంకారపు మాటలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకపోతే మాదిగల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కాశీరాం, సలహాదారుడు పోచారం, యాదవ రావు, రవీందర్, మారుతి, శంకర్, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు

సోయా.. గయా..

(5వ పేజీ తరువాయి)

పంట ఉండడంతో మురిగిపోయింది. ఇప్పుడు కోత సమయంలో దిగుబడి బాగా తగ్గింది.

● ఎకరాన 2 నుంచి 4 క్వింటాళ్ల వరకే..

జిల్లాలో సోయా పంట కోతలు ప్రారంభమయ్యాయి. హార్వేస్టర్‌ల సాయంతో రైతులు పం టను కోస్తున్నారు. ఎకరాన కేవలం 2 నుంచి 3 క్వింటాళ్ల మాత్రమే దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. గతంలో ఎకరా న 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. ఈసారి సగానికి పైగా దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాయదశలో గింజలు పూర్తిగా నిండలేదు. విత్తనాలు వేసిన తర్వాత గడ్డిమందు ఒకసారి పూ త, కాయల దశలో తెగుళ్ల నివారణతో మరోసారి పిచికారీ చేసి పంటను కాపాడుకున్నారు. భారీ వర్షాలతో పంట నీట మునగడం తెగుళ్ల భారిన పడడం, తేమతో దిగుబడులు అమాంతంగా పడిపోయాయని రైతులు చెబుతున్నారు.

● పెట్టుబడులు కూడా రాని పరిస్థితి

సోయా పంట సాగుకు పెట్టిన పెట్టుబడు లు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎకరానికి విత్తనాల నుంచి కోత వరకు రూ.23 వేలు వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.4 వేల నుంచి రూ.4,600ల వరకు ధర పలుకుతుంది. కానీ ప్రభుత్వం మద్దతు ధర రూ.5 వేల 328 ఉంది. భారీ వర్షాలతో పంట దిగుబడులు తగ్గిపోవడం వచ్చిన పంట నాణ్యతగా లేకపోవడంతో మార్కెట్‌లో దళారులు అధిక ధర ఇవ్వడం లేదు. ఇక ప్రభుత్వం నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కావడం లేదు. కేంద్రాలు ప్రారంభిస్తే మద్దతు ధరకు సోయాను విక్రయించవచ్చని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కాలభైరవ స్వామి ఆలయంలో సింధూర పూజలు

రామారెడ్డి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలభైరవ స్వామి ఆలయంలో వైభవంగా సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ప్రియమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ పురోహితులు మంత్రోచ్చారణలతో సంతతధారాభిశేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి భక్తులు ఆలయానికి పాద యాత్ర నిర్వహించారు. ఆలయంలో ఓం భైరవ.. ఓంఓం భైరవ... ఓం శ్రీ కాలభైరవ.. ఓంఓం శ్రీ కాలభైరవ స్వామి అంటూ ప్రత్యేక పూజలు, పాటలు, హోమం, యజ్ఞం, కొబ్బరి కాయలు కట్టడం, జెండా ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

రిజర్వేషన్ కల్పించాలని వినతి

లింగంపేట, అక్టోబర్ 7, (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన పలువురు సర్పంచ్ రిజర్వేషన్ కోసం అడిషనల్ కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామానికి 70 ఏళ్లుగా సర్పంచ్ స్థానానికి ఎస్సీ రిజర్వేషన్ రాలేదని అన్నారు. దీంతో గ్రామానికి చెందిన తమ వర్గం వారు రాజకీయంగా అభివృద్ధి చెందడం లేదని చెప్పారు. ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్‌ను మార్చు చేసి ఎస్సీకి కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో దళిత నాయకులు సాయిలు,సంజీవులు, ప్రవీణ్‌కుమార్, పరాందాములు, బాలయ్య, రాములు ఉన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

వామ్మో.. వానరాలు

భిక్కనూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయంలో కోతుల గుంపులతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతుల కారణంగా భక్తులు చేతిలో కర్రలను పట్టుకుని స్వామివారిని దర్శించుకునే పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతుల్లో ప్రసాదాలు, కవర్లు ఉంటే చాలు ఎత్తుకెళ్తున్నాయని, ఆలయ సిబ్బంది టపాసులు, లేజర్ లైట్లతో వాటిని భయపెట్టి



కర్రలు పట్టుకొని పూజలు చేస్తున్న భక్తులు

ప్రయత్నాలు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆలయంలో వానరాల బెడద లేకుండా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సదాశివనగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంతో పాటుగా మావహక్కులపై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై పుష్పరాజ్ అన్నారు. సహచట్టం- 2005 20వ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం సదాశివనగర్ మండలంలోని తెలంగాణ మోడల్ పాఠశాల, కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం రాష్ట్ర డైరెక్టర్ సలీం, ఎస్సై మాట్లాడుతూ.. చట్టాలపై, హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి, తెలుసుకోవాలని అన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం, బాలకార్మిక హక్కు చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రాజారెడ్డి, జిల్లా సలహాదారులు రాజేశ్వర్, సహచట్టం పరిరక్షణ కమిటీ ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి

సదాశివనగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను రుణ గ్రహీతలు సకాలంలో చెల్లించాలని గ్రామీణ బ్యాంకు మేనేజర్ సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉత్తునూర్ శాఖ ఆధ్వర్యంలో సీబీఆర్‌ఎం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు నిర్దేశించిన బ్యాంకు రుణాలను సకాలంలో టార్గెట్ పూర్తి చేయడానికి తనవంతుగా సహకరిస్తానని అన్నారు. సీసీ భూమయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి మహిళా సభ్యురాలికి బీమా రూ.2లక్షలు, ప్రమాదబీమా రూ. లక్ష సౌకర్యం కల్పిస్తుందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా సౌకర్యం



డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్

ప్రతి సభ్యురాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళ సంఘం అధ్యక్షురాలు లావణ్య, ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, సీసీలు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తున్నాం

కామారెడ్డి టౌన్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి ప్రయత్నాన్ని టీఎస్ యూటీఎఫ్ తరఫున ఖండిస్తున్నామని ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకులబాబు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల దురంకారం, మత ఆగడాలు, సనాతన ధర్మం పేరు మీద చేస్తున్న దాడులు నేడు దేశమంతటా రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగంపట్ల, ప్రజాస్వామ్యం పట్ల, న్యాయవ్యవస్థ పట్ల ఏ మాత్రం గౌరవం లేని అనాగరిక, అసాంఘిక మతవాద శక్తులు విచ్చలవిడిగా విజృంభిస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని అన్నారు. సీజేఐపై దాడికి ప్రయత్నించిన అడ్వకేట్ కిశోర్ రాకేష్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, రాజవర్ధన్, ఉపాధ్యక్షుడు సాయిగౌతమ్, నారాయణ, నాంపల్లి, బాలయ్య, రత్నం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అంటే ముమ్మాటికీ రాజ్యాంగంపై దాడే..

సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేయడం అంటే ముమ్మాటికీ రాజ్యాంగంపై జరిగిన దాడేనని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద



నిరసన తెలుపుతున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

రమేష్ అన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. న్యాయవాది ముసుగు వేసుకున్న ఒక సనాతన వాది కోర్టు హాల్‌లో న్యాయవాదులంతా చూస్తుండగా దాడికి యత్నించడం అత్యంత హేయమైన, దుర్మార్గమైన చర్య అని అన్నారు. మనుస్మృతిని తమ రాజ్యాంగంగా కొనసాగిస్తున్న కొన్ని పార్టీలు, సంస్థలు భారత రాజ్యాంగాన్ని గౌరవించడం అమలు చేయడం వారికి ఇష్టం లేదన్నట్టుగా ఈ చర్య మరోసారి రుజువు చేసిందని విమర్శించారు.

మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం

కామారెడ్డి రూరల్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపడుకుందామని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గల మహనీయుల విగ్రహాల ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అదే విధంగా అ డ్లూర్‌లో సైతం స్థానిక నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ అత్యున్నత న్యాయస్థానంలోని ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాది వృత్తిలో ఉండి న్యాయమూర్తిపై దాడి చేయడం సిగ్గు చేటు అన్నారు. మతోన్మాద బావాలతో దాడులు చేయడం సరికాదని



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నాయకులు

తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్, సిద్దిరాములు, మల్లన్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, టీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, కల్లూరి భూమయ్య, శివలింగం, రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కమిటీ నియామకం

రామారెడ్డి, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొగుళ్ల ప్రవీణ్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల యూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా పిప్పిరి గణేష్, ఉపాధ్యక్షుడిగా అద్నాన్, ప్రధాన కార్యదర్శిగా పండ్ల నిశాంత్‌లు ఎన్నికయ్యారు. కోశాధికారిగా సురేందర్, కార్యదర్శులు, సలహాదారులుగా జి.నరేష్, రంజిత్, కె.రంజిత్, అరవింద్, శ్రీకాంత్‌గౌడ్, సంతోష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడు తూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పోలింగ్ కేంద్రం పరిశీలన

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని హాజీపూర్ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో ప్రకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో కావాల్సిన సౌకర్యాలను సిద్ధం చేశామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పకడ్బందీగా నిష్పక్షపాతంగా నిర్వహించడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ కార్యదర్శి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వరద నష్టంపై జిల్లాకు కేంద్ర బృందం

(5వ పేజీ తరువాయి)

లకు చెందిన రూ.310 కోట్ల వరకు నష్టం జరిగినట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. ఇందుకు గాను వరద బాధితులను ఆదుకునేందుకు, తాత్కాలిక మరమ్మతు పనులకు యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో దెబ్బతిన్న రోడ్లు, కొట్టుకుపోయిన ప్రాజెక్టులు, చెరువులకు తాత్కాలిక పనులు చేపట్టారు. అయితే వరదల వల్ల తీవ్రంగా నష్టం వాటిల్లడంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో జరిగిన వరద నష్టంపై కేంద్ర బృందం బుధవారం కామారెడ్డి జిల్లాకు రానుంది. నలుగురు సభ్యులతో కూడిన కేంద్ర ఉన్నతాధికారుల బృందం జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. స్థానికంగా వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లను, బ్రిడ్జిలను, ప్రాజెక్టులను, చెరువులను, పంటలను పరిశీలించనున్నారు. బాధిత రైతులను కేంద్ర బృందం సభ్యులు నష్టంపై వివరాలు అడిగి తెలుసుకోనున్నారు. అదేవిధంగా కామారెడ్డి కలెక్టరేట్లో వరద నష్టంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను బృందం సభ్యులు పరిశీలించనున్నారు.

కేంద్ర బృందం పర్యటన ఇలా..

వరద నష్టాన్ని తెలుసుకునేందుకు కేంద్రానికి సంబంధించిన ఇరిగేషన్, ఆర్అండ్‌బి, అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖలకు చెందిన నలుగురు సభ్యులతో కూడిన ఉన్నతాధికారులు జిల్లాలో పర్యటించనున్నారు. మొదట బిక్కనూరు మండలంలోని దస్నమ్మకుంట చెరువును, అంతంపల్లిలోని పంచాయతీరాజ్ రహదారిని, అదే గ్రామంలో పంట పొలాల్లో వెలిసిన ఇసుకమేటలను పరిశీలిస్తారు. అక్కడి నుంచి బీబీపేట్, కామారెడ్డి పట్టణ కేంద్రంలో వరదల వల్ల దెబ్బతిన్న జాతీయ రహదారులను పరిశీలించనున్నారు. లింగంపేట్‌లో ఆర్అండ్‌బీ రహదారిని, బ్రిడ్జిని, దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తారు. అనంతరం నాగిరెడ్డిపేటలోని పోచారం ప్రాజెక్టును పరిశీలించి నష్టంపై వివరాలు అడిగి తెలుసుకోనున్నారు.

ఎస్సారెస్పీకి భారీ వరద

మెండోరా, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువ నుంచి భారీగా జలాశయంలోకి ఇన్ఫ్లో వస్తోం ది. దీంతో ప్రాజెక్టు అధికారులు 37 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 2,36,460 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా.. అధికారులు 2,37,730 క్యూసెక్కుల నీటినిదిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1090.90 అడుగులు (80.053 టీఎంసీలు) నీటినిల్వ ఉంది. వరద నీరు భారీగా చేరుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు నుండి ఆయా కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా 4,000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, మిషన్ భగిరథకు 231 క్యూసెక్కులు, అదనంగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరైపోతోంది. మొత్తం 1,87,730 క్యూసెక్కుల నీరు వరద గేట్ల ద్వారా నీరు విడుదల జరుగుతోంది.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- భద్రకాళీ
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి ఓజీ
వెంకటేశ్వర కాంతార

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230